సగా పంపించిన కొన్ని కార్యక్రమాల పేపర్ కటింగ్స్, వేరువేరు రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొంది, విశేషఖ్యాతిని గడించిన కొందరి ఇంటర్వ్యూలు, విశేషాలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వాళ్లందరూ కూడా మాధవ్ నడిపిస్తున్న 'చార్వాక నాలెడ్జ్ సెంటర్' ద్వారా పొందిన స్ఫూర్తే తమ విజయాలకు, ఎదుగుదలకు, చైతన్యానికి మూలమని ప్రకటించడం.. సాగర్‌లో ఆసక్తిని రేపింది.

పాఠశాల స్థాయిలో తాను చదువుకున్న ధన్గర్‌వాడీ హైస్కూల్లో సాగర్‌కు మాధవ్ ప్రాణస్నేహితుడు. ఇద్దరూ పేద కుటుంబాల్లోంచి వచ్చినవాళ్లే. ఇద్దరూ తెలివైన విద్యార్థులే. మొదటినుంచీ సాగర్‌కు బాగా చదివి గొప్ప ఇంజినీర్ కావాలనీ, జీవితంలో బాగా స్థిరపడాలనీ బలమైన కోరిక ఉండేది. చదువు తప్ప వేరే ఏ ఇతర విషయాల్లోనూ తలదూర్చేవాడు కాదు. కానీ, మాధవ్ చదువుతోపాటు ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లోనూ చురుగ్గా పాల్గొనేవాడు. ప్రశ్నించే తత్వాన్ని మెండుగా కలిగినవాడు. ఆ వయసులోనే సమాజంలో నెలకొన్న ఆర్థిక, సామాజిక అంతరాల గురించి టీచర్లను ప్రశ్నించేవాడు.

'పెద్దయ్యాక అన్నీ తెలుసుకోవచ్చు. ముందు బాగా చదువుకో..' అని టీచర్లు సర్దిచెప్పేవాళ్లు.

పదో తరగతిలోనే పాఠ్యపుస్తకాలతోపాటు ఇతర సాహిత్యాన్ని చదవడం అలవాటైంది.

ఇంటర్మీడియెట్లో ఇద్దరూ ఎంపీసీలో చేరారు. అప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వామపక్ష ఉద్యమాలతో కరీంనగర్ కల్లోల కడలిలా ఉంది. పల్లెల నుంచి వచ్చిన శ్రామిక, ఉత్పత్తి కులాల పిల్లలంతా ఆ ఉద్యమాలకు ప్రభావితం అవుతున్న కాలం. తమ తండ్రులు తాతల వెట్టి జీవితాలకు, తమ వెనుకబాటుతనానికి కారణమైన భూస్వామ్య దోపిడీ మూలాలను విప్పి చెబుతుంటే.. ఎందరో విద్యార్థులు త్యాగాలకు సిద్ధమై ఉద్యమాల్లోకి ఉరుకుతున్న సమయం. మాధవ్ కూడా విద్యార్థి ఉద్యమాల్లో కీలక భూమిక పోషించసాగాడు. మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని, అభ్యుదయ, విప్లవ సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేశాడు. సామ్యవాద సిద్ధాంతమే సాంఘిక, ఆర్థిక అసమానతలకు విముక్తి మార్గమని తన ఉపన్యాసాల్లో అనర్గళంగా మాట్లాడేవాడు.

సాగర్ కంటే మాధవ్ మెరిట్ స్టూడెంట్ అయినా.. ఉద్యమ ప్రభావంతో చదువును అశ్రద్ధ చేయసాగాడు. పైగా ఈ చదువులు జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దలేవని, మనుషుల్ని కేవలం కెరియరిస్టుగానే మిగులుస్తాయని వాదించేవాడు. క్రమంగా విద్యార్థి ఉద్యమాల్లోంచి, ప్రజా ఉద్యమాల్లోకి వెళ్లాడు. రైతు కూలీ సంఘాలతో కలిసి పోరాటాలు చేయడం వల్ల కాలేజీకి దూరమయ్యాడు. ఎలాగోలా ఇంటర్మీడియెట్ పాస్ అయ్యాడు కానీ, తరువాత చదువు కొనసాగించలేకపోయాడు.

సాగర్ మాత్రం.. తాను అనుకున్నట్లే ఇంటర్మీడియెట్ తరువాత ఇంజినీరింగ్ సీటు సంపాదించుకొని, అది పూర్తికాగానే వివాహం చేసుకోవడం, అతని మామ స్థితిమంతుడు కావడంతో ఆయన సపోర్ట్‌తో అమెరికా వెళ్లడం, తరువాత ఎలక్ట్రానిక్స్ రంగంలోకి ప్రవేశించి గొప్ప వ్యాపారవేత్తగా స్థిరపడిపోవడం జరిగిపోయింది.

మాధవ్ రెండేళ్లు ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసి, నిర్బంధం తీవ్రతరం కావడంతో ఉద్యమంలోంచి బయటికి వచ్చి.. తిరిగి డిగ్రీ, బీఎడ్ చేసి టీచర్ ఉద్యోగం సంపాదించుకున్నాడు. అయితే అలలను పట్టి బంధించడం, కలలను కట్టడి చేయడం ఎవరితరం? ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నప్పుడు కూడా అతని చైతన్యం అతణ్ని స్తబ్దంగా ఉండనివ్వలేదు. తిరిగి ఉపాధ్యాయ సంఘంలో క్రియాశీలకంగా పనిచేశాడు. కవిగా, రచయితగా ప్రజా జీవితంలోని సంక్షోభాలను, ప్రభుత్వం కొనసాగిస్తున్న జీవన విధ్వంసాన్ని వస్తువుగా చేసుకొని, అద్భుతమైన కవిత్వం, కథలు రాశాడు. మూఢ విశ్వాసాల ముసుగు విప్పుతూ కులం పేర, మతం పేర జరుగుతున్న అమానవీయ సంఘటనలను, ఛాందస భావాలను ఎండగడుతూ.. శాస్త్రీయ జ్ఞానం, తార్కిక చింతన జీవితాన్ని ఎంత అర్థవంతంగా మారుస్తాయో, అభ్యుదయ సమాజ నిర్మాణానికి ఎలా దోహదపడుతుందో సభలు, సమావేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశాడు.

సాగర్ అమెరికాలో ఉన్నప్పుడు చిన్ననాటి క్లాస్‌మేట్స్ ఎవరితోనూ కమ్యూనికేషన్ ఉండేది కాదు. కేవలం మాధవ్ ఒక్కడే సాగర్‌తో టచ్‌లో ఉంటూ తను చేస్తున్న కార్యక్రమాలను షేర్ చేసుకునేవాడు. పదేళ్లక్రితం మాధవ్ రిటైర్ అవుతున్న సందర్భంలో ప్రస్తావించిన విషయం.. ఈ ప్రయాణంలో సాగర్‌కు మళ్లీ గుర్తుకొస్తుంది.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.

"ఒరేయ్ సాగర్.. రిటైర్ అయిన డబ్బులతో కరీంనగర్‌ను ఆనుకొని ఉన్న మానేరు నది ఒడ్డున ఎకరం స్థలం కొని, దానిని సాహిత్య, సాంస్కృతిక, జ్ఞాన కేంద్రంగా ఏర్పాటుచేసి, ఆయా రంగాల్లో నిష్ణాతులైన సాహితీవేత్తలు, కళాకారులు, విద్యావేత్తలు, వైజ్ఞానిక వేత్తలతో నిరంతరం కార్యక్రమాలు నిర్వహించాలని అనుకుంటున్నాను. ఏమంటావురా?"..

అందుకు మాధవ్‌ను వారించాడు సాగర్.

"జీవితాంతం కష్టపడి సంపాదించుకున్న డబ్బును, సమాజ సేవా కార్యక్రమాలకని ఖర్చు చేస్తే.. విశ్రాంత జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు ఎవరు ఆదుకుంటారు?" అన్నప్పుడు..

"అనిశ్చితమైన నా భవిష్యత్తు కోసం, నిశ్చయంగా నేను ఆశించే లక్ష్యాన్ని దూరం చేసుకోలేను. సమాజం నుంచి నేను పొందినదేమిటో, నా జీవితం నాకు రుజువు పరిచింది. పోతూ పోతూ నేనూ ఈ సమాజానికి మంచినేదో కొంత అందించి పోవాలి. ఈ నాలెడ్జ్ సెంటర్ కేంద్రంగా నేను చేసే కార్యక్రమాలతో స్ఫూర్తి పొందిన కొత్తతరానికి చెందిన కొందరైనా అభ్యుదయ ఆలోచనల్ని, శాస్త్రీయ దృక్పథాన్ని తప్పకుండా అందిపుచ్చుకుంటారు".. స్థిరంగా అన్నాడు మాధవ్.

పదేళ్ల క్రితం మాధవ్ కలగన్న స్వప్నం, ఈనాడు నిజమై ఫలితాన్నిస్తున్నది. మాధవ్ ఆలోచన సాగర్‌కు అప్పుడు మూర్ఖంగా అనిపించినా, ఇప్పుడు దాని విలువ ఏమిటో, సమాజం స్పందిస్తున్న తీరుతో సాగర్‌కు అర్థమైంది.

సాగర్ చేరాల్సిన గమ్యం రాగానే అప్పటిదాకా కురిసిన జ్ఞాపకాల జడివాన ఒక్కసారిగా ఆగిపోయింది. ఎదురుగా 'చార్వాక జ్ఞానకేంద్రం' అన్న బోర్డు కనిపించింది. కళ్లతోనే చుట్టూ పరిసరాలను ఒక్కసారి అట్లా చూశాడో లేదో.. సాగర్ కళ్లల్లో కాంతిపూలు పూశాయి.

కారు దిగగానే ఎదురు చూస్తున్న మాధవ్.. తన మిత్రుణ్ని ఆప్యాయంగా గుండెకు హత్తుకున్నాడు.

"ఇప్పటికి నీ దగ్గరికి రావాలన్న నా కోరిక నెరవేరింది రా మాధవా!" అన్నాడు సాగర్.

అది సాయంత్రం సుమారు ఆరుగంటల సమయం. దినమంతా లోకాన్ని వెలిగించి, పడమటి పడక నెక్కబోతున్న సూర్యునిలోని ఎర్రెర్రని ఎరుపు, మాధవ్‌లోని చైతన్యానికి ప్రతీకగా తోచింది సాగర్‌కు.

చుట్టూ పళ్ల చెట్లు, పూల మొక్కలతో నిండి ఉన్న పచ్చని వాతావరణం. మధ్యలో సుమారు రెండు మూడు వందల మంది కూర్చోగలిగే పెద్ద హాలు.. బెంగుళూర్ టైల్స్‌తో కళాత్మకంగా నిర్మితమైంది. లోపల పెద్ద వేదిక. లోపలి గోడలపై గౌతమ బుద్ధుడు, పూలే, అంబేద్కర్‌తోపాటు భారతీయ తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, సాహితీవేత్తల చిత్రపటాలు ఒకవైపు.. బ్రూనో, సోక్రటీస్, మార్క్స్, లెనిన్, ఎంగెల్స్ వంటి పాశ్చాత్య తత్వవేత్తల చిత్రాలు, భగత్‌సింగ్, అల్లూరి, కొమురం భీం వంటి పోరాటయోధుల ఫొటోలు క్రమపద్ధతిలో అమర్చి ఉన్నాయి. ఇంకో గోడపై దాని నిర్మాణానికి సహకరించిన దాతలపేర్లు రాసి ఉన్నాయి.

హాల్ పక్కనే ఒక లైబ్రరీ, దాని నిండా వందలాది పుస్తకాలు. రెఫరెన్స్ కోసం అక్కడికివచ్చే రీసెర్చ్‌స్కాలర్స్ కొన్నిరోజులు ఉండాల్సి వస్తే.. వారికోసం చిన్నచిన్న గదులు నిర్మించారు. ఇంకోవైపు మాధవ్ నివాసం ఉంటున్న అందమైన కుటీరంలాంటి ఇల్లు. వీటికి ఎదురుగా యోగాసాధన కోసం పెద్ద లాన్. అందంగా క్రమ